క్లుప్తంగా

అంబటిని మర్యాదపూర్వకంగా కలిసిన నేతలు



పట్నంబజారు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబును నూతనంగా పార్టీలో పదవులు పొందిన పలువురు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. సిద్ధార్థనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తాడికొండ నియోజకవర్గానికి చెందిన బేతపూడి రాజేంద్రకుమార్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ పార్టీలో పదవులు వచ్చిన ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం రాజేంద్రప్రసాద్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, బత్తుల కిశోర్, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, దానం వినోద్, శేషగిరి పాల్గొన్నారు.

టెన్నిస్ క్రీడాకారుడు పాల్‌మనోహర్‌కు సన్మానం



గుంటూరు వెస్ట్: అంతర్జాతీయ టెన్నిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వెటరన్ టెన్నిస్ క్రీడాకారుడు పాల్‌మనోహర్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, ఎన్టీఆర్ స్టేడియం టెన్నిస్ క్రీడాకారులు కలిసి ఆయనను సత్కరించారు. పాల్ మనోహర్ చిన్ననాటి నుంచి టెన్నిస్‌ను అకుంఠిత దీక్షతో సాధన చేస్తున్నారని పలువురు కొనియాడారు. ప్రస్తుతం వెటరన్ విభాగంలోనూ ఆయనకు ప్రత్యేక స్థానముందని తెలిపారు. టెన్నిస్ ఆడే చిన్నారులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. జెన్‌కో మాజీ ఎస్ఈ ఎం.రాజేంద్ర ప్రసాద్, టెన్నిస్ కోచ్ జీవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశ రక్షణలో భాగస్వాములు కావాలి



నగరంపాలెం: శత్రుదేశాల నుంచి భారత దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మేజర్ జనరల్ మాదినేని రమేష్‌బాబు అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో పాకిస్తాన్ తో యుద్ధం –సింధూరంపై విశ్లేషణ సభ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సభకు గుడిపూడి వెంకటరాయుడు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మేజర్ జనరల్ మాదినేని రమేష్‌బాబు మాట్లాడుతూ యుద్ధంలో దేశ పౌరులందరు భాగస్వాములు కావాలని చెప్పారు. దేశ ప్రజలకు, భవిష్యత్ తరాలకు ఉన్నది దేశం ఒక్కటేనని అన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో భారత సైన్యం, శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకుల భాగస్వామ్యంతో విజయం సాధించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాదెండ్ల మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి టీవీఎస్ జూపిటర్ 125 స్కూటీ



నగరంపాలెం: స్థానిక మార్కెట్ కూడలిలోని పయనీర్ టీవీఎస్ షోరూంలో శుక్రవారం టీవీఎస్ 125 సీసీ జూపిటర్ 125(ఎస్ఎక్స్‌సి) డ్యూయల్ టోన్ స్కూటీని నగర మెకానిక్ సంఘం అధ్యక్షుడు షేక్ గౌస్, నాయకులు షేక్ అసిఫ్‌అలీ (సంబూరు మేస్త్రీ) ప్రారంభించారు. ముందస్తుగా బుక్ చేసుకున్న పది మందికి నూతన స్కూటీలను అందించారు. కార్యక్రమంలో పయనీర్ టీవీఎస్ సంస్థ సీఈఓ రాఘవేంద్ర, ప్రైవేటు మెకానిక్‌లు, కస్టమర్లు పాల్గొన్నారు.

నేడు గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం

కొరిటిపాడు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ గుంటూరు కేంద్ర కార్యాలయం ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని సింధూరి హోటల్‌లో శనివారం ఉదయం యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు బ్యాంక్ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాటా మోసం అంత.. ఇంత కాదయ్యా

- నగరంలో వ్యాపారుల వద్ద రాళ్ల కాటాలు
- కిలోకి 800 గ్రాములు మాత్రమే..
- సామాన్యుల జేబులు గుల్ల చేస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని లీగల్ మెట్రాలజీ శాఖ



కొత్తపేట పశువుల ఆస్పత్రి వద్ద రాళ్ల కాటాతో వ్యాపారం నిర్వహిస్తున్న ద్రాక్ష పండ్ల వ్యాపారి



రాళ్ల కాటా

నెహ్రూనగర్: నగరంలోని నెహ్రూనగర్‌కు చెందిన ప్రవీణ్ కుమార్ మార్కెట్ నుంచి వస్తూ కొత్తపేట పశువుల ఆస్పత్రి వద్ద ద్రాక్షలు కొనుగోలు చేశాడు. కిలో రూ.80 అంటే సరే ఇవ్వండి అని చెప్పి డబ్బులు ఇచ్చాడు. తన కళ్ల ముందే కాటా మీద కిలో రాయి పెట్టి కేజీ ద్రాక్ష తూకం వేసి కవర్‌లో ఇచ్చారు సదరు ద్రాక్ష కాయాల వ్యాపారి. అయితే తూకంలో ఏదో మోసం ఉందని గమనించి వేరే కూరగాయాల షాపు వద్ద ఉన్న ఎల్రక్టానిక్ కాటాపై తాను కొన్న ద్రాక్ష కాయాలను కాటా వేసి చెక్ చేసుకున్నాడు. 800గ్రాములు మాత్రమే వచ్చింది. దీంతో నేను మోసపోయానని గమనించి సదరు వ్యాపారి దగ్గరకు వెళ్లి అడిగితే కాటా బాగానే ఉంది. ఇంకా మీకు మొగ్గు కూడా వేశానని బుకాయించే ప్రయత్నం చేశారు. ఈ విధంగా ప్రతి రోజు సామాన్య ప్రజలను వ్యాపారులు దోచుకుంటున్నారు. కొంత మంది తూకంలో మోసం తెలుసుకుని ప్రశ్నిస్తుంటే..మరి కొంత తెలుసుకోక అలాగే వదిలేస్తున్నారు.

తూకాల్లో తేడాలు...

'అంతా మాయా ప్రపంచం అయిపోయింది' మనం మార్కెట్‌కు వెళ్లి కొనుగోలు చేసిన వస్తువు తూకంలో తేడా వస్తే గట్టిగా నిట్టూర్చి చాలామంది అనే మాట ఇది. కొనుగోలుదారుడిని మోసం చేయడానికి కొందరు వ్యాపారులు రకరకాల పద్ధతులు అవలంబిస్తున్నారు. అందుకే బాగా గమనించి మరీ వస్తువులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తూకంలో మోసాలను అరికట్టే వ్యవస్థ లేదా? అంటే ఉంది. అదే తూనికలు కొలతలు శాఖ(లీగల్ మెట్రాలజీ). ఆ శాఖ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించడంతో వ్యాపారుల దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోయింది.

ప్రస్తుతం ప్రతి వస్తువు కిలోల లెక్కే

ప్రస్తుతం ప్రతి వస్తువు కిలోల లెక్క అయిపోయింది. సీజనల్ పండ్లు అయిన మామిడి కాయలు, నేరెడు పండ్లు, ఊసిరి కాయలు, ద్రాక్ష కాయాలు ఇలా ప్రతి ఫలం కూడా కిలోల లెక్కన అమ్ముతున్నారు. అయితే కొంత మంది వ్యాపారులు న్యాయంగా న్యాయమైన కాటాతో తూకం తూచి పండ్లు అమ్ముతుంటుంటే మరికొంత మంది వ్యాపారులు కాసులకు కక్కుర్తి పడి సామ్యాన ప్రజలను తూకంలో మోసం చేసి సొమ్ము చేసుకుంటున్నారు. రాళ్ల కాటాను తనిఖీలు చేసి రాళ్ల మీద స్టాంపింగ్ వేయించుకోవాలని లీగల్ మెట్రాలజీ అధికారులు కనీసం వ్యాపారస్తులకు అవగాహన కల్పించకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా సామాన్య ప్రజలను దోచేస్తున్నారు.

> **తనిఖీలు నిర్వహిస్తాం**
>
> తూకంలో జరిగే మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మార్కెట్, పశువుల ఆస్పత్రి వద్ద వ్యాపారాలు నిర్వహించే వారి వద్ద ఉన్న కాటాలను పరిశీలిస్తాం. అందులో ఏమైన తేడాలుంటే కేసులు నమోదు చేస్తాం.
>
> – సునీల్ రాజు, ఇన్‌స్పెక్టర్, లీగల్ మెట్రాలజీ

కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని జిల్లా కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఏడాది పాలనపై శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకి రూ.15 వందల సాయం, ఉచిత ప్రయాణం ఊసే లేదన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో దోపిడీకి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇంటి పన్ను అదనంగా జిల్లాలో రూ.44 కోట్లు భారం ప్రజలపై మోపడానికి సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు. ప్రధానంగా ఇళ్లు లేని లక్షలాది మంది పేదలకు గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్ళు నిర్మించాలని విన్నవించారు. ప్రభుత్వ భూములు, ఇతర భూములలో దశాబ్దాలుగా ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలను సత్వరమే పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని చెప్పారు. గుంటూరు నగరంలో నిలిచిపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయాలని, మున్సిపల్ కూరగాయల మార్కెట్ భవనం, నార్ల ఆడిటోరియం పి.పి.పి. పద్ధతిలో కాకుండా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. శంకర్ విలాస్ బ్రిడ్జి ఆర్.యు.బి.లతో సహా పూర్తి స్థాయిలో నిర్మించాలన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌లో అవసరమైన మేరకు ప్రొఫెసర్లను నియమించాలని, దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజ్ బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిపియం నగర కార్యదర్శి కె.నళిని కాంత్, జిల్లా నాయకులు ఈమని అప్పారావు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయండి

జిల్లా కార్యదర్శి కిరణ్



ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి

లక్ష్మీపురం: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) అఖిల భారత మహాసభలు కేరళ కోజికోడ్ జిల్లాలో జూన్ 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి కిరణ్ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా కమిటీ పిలుపుమేరకు గుంటూరు జిల్లాలో అన్ని మండలాలు, కాలేజీలో ఎస్ఎఫ్ఐ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి సంఘం ఏర్పడి 55 ఏళ్లు పూర్తి చేసుకుందని వివరించారు. ఇన్ని సంవత్సరాల్లో అన్ని పోరాటాల్లో ముందు ఉందన్నారు. రాబోయే మూడు సంవత్సరాల్లో విద్యా రంగం ఎలా ఉండాలి విద్యార్థుల సమస్యల మీద ఎలా పని చేయాలి అనే అంశాల మీద మహాసభలు భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.

యోగాంధ్ర కాదు.. ఉద్యోగాంధ్ర కావాలి

ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

లక్ష్మీపురం: రాష్ట్రంలో యువతకు యోగాంధ్ర కాదు.. ఉద్యోగాంధ్ర కావాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలి ప్రభుత్వాన్ని నిలదీశారు. కొత్తపేట సీపీఐ కార్యాలయం నుంచి భగత్ సింగ్ విగ్రహం వరకు శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ప్రతినెలా నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని హామీ అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు వారిలో ఏ ఉపాధి లేనివారు ఒక కోటి 56 లక్షల మంది ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయని గుర్తు చేశారు. జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య మాట్లాడుతూ జిల్లాలో ఖాళీలుగా ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి చల్లా మరియదాసు, అరుణ్, రెహ్మాన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యశ్వంత్, శివ, బన్ని, అమర్నాథ్ పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో గోసేవ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరువారితోటలోని రాధాకృష్ణ గోశాలలో ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవోపా) ఆధ్వర్యంలో 125వ వారం గోసేవ, గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగ అవోపా గుంటూరుశాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం మాట్లాడారు. కార్యక్రమంలో గోసేవ కన్వీనర్ చామర్తి రమేష్, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, సాయి రమేష్, మిరియాల మోహన్‌రావు పాల్గొన్నారు.

తూర్పు సర్వేయర్ మాతృశాఖకు సరెండర్

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ తూర్పు సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ మహబూబ్ సుభానిని కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యం కారణంగా మాతృశాఖకు సరెండర్ చేస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ, సర్వేయర్ షేక్ మహబూబ్ సుభానికి కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంపై గతంలో పలుమార్లు హెచ్చరించినా పనితీరు మెరుగు పరుచుకోలేదన్నారు. అలాగే సర్వే కోసం అర్జీలు అందించిన ప్రజల నుంచి సర్వే సర్టిఫికెట్ల జారీలో కూడా అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. దీర్ఘకాలంగా సర్వేయర్ల అసిస్టెంట్ లుగా ఉన్న అప్కాస్ సిబ్బందిని పూర్తి స్థాయిలో తొలగించి, వారి స్థానంలో సీనియార్టీ క్రమంలోని పర్మినెంట్ చైన్ మెన్‌లను అసిస్టెంట్‌లుగా విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. అదేవిధంగా పరిపాలన అవసరాల రీత్యా గుంటూరు-2 సర్వేయర్ లక్ష్మీనారాయణకు తూర్పు సర్వేయర్ విధులు అదనంగా కేటాయించినట్లు పేర్కొన్నారు.

ఫార్మసీ పరిశోధనల దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలి



శంకర్‌ప్రసాద్‌ను సత్కరిస్తున్న జూపూడి రంగరాజు, రాధాకృష్ణమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ రంగంలో పరిశోధనల దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ శాఖ ముఖ్య సాంకేతిక సలహాదారుడు డాక్టర్ ఎం.శ్రీనివాస శంకర్‌ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో పరిశోధనలు- అభివృద్ధి అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస శంకర్‌ప్రసాద్ మాట్లాడుతూ ఫార్మసీ కళాశాలల్లో బోధన చేస్తున్న అధ్యాపకులు ఔషధ రంగంలో పరిశోధనలు చేసి, నూతన ఔషధాలను ఆవిష్కరించాలని సూచించారు. విద్యార్థులకు తగిన శిక్షణ కల్పించి, పరిశోధన సాగించే విధంగా పర్యవేక్షించాలన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్‌లతో పాటు స్టార్టప్ కంపెనీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ పాముకాటు, కాళ్ల తిమ్మిర్లకు మనం వినియోగించే క్రియాశీల రసాయన పదార్థాల వివరాలను తెలుసుకుని, పేటెంట్ పొందవచ్చునని తెలిపారు. గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ మధుమేహ చికిత్సకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఔషధాల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీ నాగభూషణం పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, ఏకాగ్రత



యోగా సాధన చేస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: యోగాను దైనందిన జీవితంలో భాగం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత అలవడుతుందని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. యోగాంధ్రలో భాగంగా భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో గోరంట్లలోని భాష్యం క్రీడా మైదానంలో యోగోత్సవ్ పేరుతో నిర్వహిస్తున్న యోగా కార్యక్రమం శుక్రవారం కొనసాగింది. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు యోగాసనాల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు ఏకాగ్రత పెంపొందించుకుని, చదువులో చురుగ్గా ఉంటారని అన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించడంలో యోగా ఎంతో కీలకపాత పోషిస్తుందన్నారు. ప్రముఖ యోగా గురువు బి.మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యార్థులు యోగాను ఆచరించడం ద్వారా ఏకాగ్రత, ప్రశాంతత అలవడుతుందని, తద్వారా నిర్దేశిత లక్ష్యాలను సాధించగలరన్నారు. అనంతరం ప్రాణాయామ, యోగాసనాల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో కలిసి భాష్యం రామకృష్ణ యోగా సాధన చేశారు. యోగాంధ్రలో భాగంగా భాష్యం అన్ని క్యాంపస్‌లలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో భాష్యం వైస్ చైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్ పాల్గొన్నారు.

రోబోటిక్ సర్జరీలతో నూరు శాతం కచ్చితత్వం

మాస్కో వేదికపై డాక్టర్ నరేంద్ర రెడ్డి



రోబోటిక్ సర్జరీపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్: రోబోటిక్ సర్జరీల ద్వారా రోగికి మనం నూరు శాతం కచ్చితత్వాన్ని అందించవచ్చని సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. రానున్న కాలంలో వైద్య రంగం పురోభివృద్ధిలో రోబోటిక్‌ల పాత్ర ప్రధాన భూమిక పోషించనుందని చెప్పారు. రష్యా రాజధాని మాస్కోలో యూరో ఆసియన్ ఆర్థోపెడిక్ ఫోరం వేదికగా జరుగుతున్న ప్రదర్శనలో శుక్రవారం డాక్టర్ నరేంద్ర రెడ్డి జాయింట్ రీప్లేస్‌మెంట్‌లో రోబోటిక్ వాడకంపై మెలకువలు, అవకాశాలు, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ తదితర అంశాలను వివరించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఈ సమావేశాలకు రష్యాకు చెందిన దాదాపుగా 500 మందికి పైగా ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు హాజరయ్యారు. భారత్‌లో జరుగుతున్న మోకీలు, తుంటి మార్పిడి శస్త్ర చికిత్సలలో రోబోటిక్ పాత్ర, అనుభవాలను డాక్టర్ నరేంద్ర రెడ్డి వివరించారు.

యువతి అదృశ్యం

లక్ష్మీపురం: యువతి కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం బయ్యవరం గ్రామానికి చెందిన బండి కవిత, అరండల్‌పేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. ఈనెల 5న ఆస్పత్రిలో విధులకు హాజరయ్యేందుకు వచ్చింది. కవిత తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల వద్ద ఆచూకి లభ్యం కాలేదు. యువతి తల్లి బండి ఏసమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

లక్ష్మీపురం: ఓ వ్యక్తి ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నేతాజీ నగర్ ప్రాంతానికి చెందిన షేక్ ఖాజా(40) ఫైనాన్స్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. భార్య, ఒక మగ, ఆడ సంతానం ఉన్నారు. అయితే ఇటీవల 8 నెలల క్రితం గుండె సంబంధించి స్టంట్ వేయించుకున్నాడు. ఇంట్లో గదిలో మృతి చెంది ఉన్నాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం పోలీసులు ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి మృత దేహాన్ని పోస్ట్ మార్టంకు తరలించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు

లక్ష్మీపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ మెప్పు కోసం కార్మికుల పని గంటలను 8 నుంచి 10 గంటలకు పెంచటం, మహిళలతో రాత్రిపూట కూడా పనులు చేయించుకోవచ్చని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించిందని, ఈ నిర్ణయాన్ని కార్మికులంతా ముక్తకంఠంతో తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో శుక్రవారం కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, ఏ.ఐ.ఎఫ్.టి.యు(న్యూ) నాయకుడు కోటయ్య మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను 2020లో ఆమోదించినప్పటికీ కార్మికుల పోరాటాలతో ఇప్పటి వరకు అమలుకు పూనుకోలేదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉప్పుడు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాటగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, నగర ప్రధాన కార్యదర్శులు బి.ముత్యాలరావు, కట్లకుంట శ్రీనివాసరావు, నాయకులు ఎం.సాంబశివరావు, షేక్ అబ్దుల్ సలీం, ఫణీంద్ర, షేక్ ఖాసీం షహీద్, ఆది నికల్సన్, దొడ్డ కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.అరుణ్ కుమార్, మేడ హనుమంతరావు నగర అధ్యక్షుడు అంజిబాబు, నాయకులు కోట మాల్యాద్రి సత్యనారాయణ, ఏ.ఐ.ఎఫ్.టి.యు(న్యూ) నాయకులు ఉల్లిగడ్డ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పని సమయాన్ని పెంచడం సరికాదు

పట్నంబజారు: పని సమయాన్ని 8 నుంచి 10 గంటలకు పెంచడం, మహిళలతో రాత్రి షిఫ్ట్ లో పనిచేయించుకోవడాన్ని అనుమతిస్తూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం కార్మిక, ఉద్యోగ వ్యతిరేకమైనదని తక్షణం ఈ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.హరి ప్రసాద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ బస్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమానికి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి టీవీజి.రవిశంకర్ అధ్యక్షత వహించారు. హరిప్రసాద్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినానికి తూట్లు పొడుస్తూ రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ నిర్ణయం చేయటం శోచనీయమన్నారు. దేశంలో, రాష్ట్రంలో ఇప్పటికే మహిళలపై పెద్ద ఎత్తున హింస, లైంగిక వేధింపులు జరుగుతున్న పరిస్థితుల్లో రాత్రి షిఫ్ట్ లో పనిచేయించుకోవాలని నిర్ణయించుకోవటం సరికాదన్నారు. ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.గంగాధర్ రావు నిరసనకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ గుంటూరు-1,2 డిపోల కమిటీల నాయకులు ఎం.వి.ఎస్.రామకృష్ణ, వి.మధుసూదన్ రావు, ఎస్.మురళీకృష్ణ, టీవీ రాఘవులు, ఆర్ శ్రీనివాసరావు, కె.అన్నా మేరీ, జయశ్రీ, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న కె.సుబ్బరావమ్మ

లక్ష్మీపురం: అంగన్‌వాడీలకు తక్షణమే పెరుగుతున్న ధరలకు వేతనాలు పెంచాలని, అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ జూన్ 23న జరిగే కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ విజ్ఞప్తి చేశారు. పాత గుంటూరులోని సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం అంగన్‌వాడీల జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు జి.రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హెల్పర్స్ ప్రమోషన్‌కు విధివిధానాలు రూపొందించాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశానికి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏవీఎన్ కుమారి అధ్యక్షత వహించగా జిల్లా ఉపాధ్యక్షురాలు సుకన్య, పద్మజా, ప్రేమలత, జిల్లా సహాయ కార్యదర్శి హేమలత, రత్న మంజుల హాజరయ్యారు.

ముగిసిన మృత్తికా బృందావన వార్షికోత్సవాలు

నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 4/19వ అడ్డరోడ్డులోని జగద్గురు శ్రీరాఘవేంద్రస్వామి వారి బృందావనంలో ఉడిపి శ్రీకృష్ణమఠం భావి పర్యాయ పీఠాధిపతులు శ్రీవేదవర్ధన తీర్థులు, శ్రీగురురాజ సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం మృత్తికా బృందావన వార్షికోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత పవన హోమం, పూర్ణాహుతి, పంచామృతాభిషేకం, కలశాభిషేకం వేదం మంత్రాలతో చేపట్టి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. శ్రీవేదవర్ధన తీర్థులు వారి పీఠానికి అత్యంత భక్తిశ్రద్ధలతో విశేష హారతులు, శంఖారావాలతో, ప్రత్యేక ఘంటారావంతో పూజలు చేపట్టి తీర్థం అందించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. రాత్రి రంగపూజ, పల్లకీ సేవ, రథసేవ, ఉయ్యాలా సేవతో వార్షికోత్సవం ముగిశాయి.

వాచ్‌మెన్ కుటుంబానికి రక్షణ కల్పించాలి



డీపీఓ ఆవరణలో ప్రజా సంఘాల నాయకులు

నగరంపాలెం: గుంటూరు విద్యానగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కుటుంబంపై ప్లాట్‌లో అద్దెకు ఉండే వ్యక్తి, డ్రైవర్ కలిసి దాడికి పాల్పడ్డారని, వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. వాచ్‌మెన్ కుటుంబానికి రక్షణ కల్పించాలని, నగరంలోని అపార్ట్‌మెంట్స్ యాజమానుల సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించాలని కోరారు. బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్.భగత్‌సింగ్, ఏపీ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, ఆర్‌పీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ముత్తయ్య, భీమసేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వరగాని ఏడుకొండలు, అపార్‌మెంట్ వాచ్‌మెన్ యూనియన్ అధ్యక్షులు మానేపల్లి దుర్గారావు, యానాదులు సంఘం ఉపాధ్యక్షులు తుపాకుల లక్ష్మీనారాయణ, డి.ప్రకాష్ పాల్గొన్నారు.